క్లుప్తంగా

మున్నేరుకు పెరుగుతున్న వరద



కంచికచర్ల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కీసర మున్నేరుకు సోమవారం వరద పోటెత్తింది. తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం, వరంగల్, వైరాలో కురుస్తున్న వర్షాలకు వరదనీరు చేరింది. మున్నేరు సమీపంలో ఉన్న పంట పొలాలన్నీ నీట మునిగాయి. మండలంలోని వేములపల్లి, ఎస్. అమరవరం గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు నీటిలో మునిగాయి. మున్నేరు ఏటిపట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వీ జాహ్నవి పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రముఖులు, జీఆర్సీ విద్యాసంస్థల కరస్పాండెంట్, సెక్రటరీ పెనుగొండ రాజీవ్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు సోమవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు కాకరపర్తి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. అనంతరం రాజీవ్ దంపతులను సన్మానించారు. వాసవీ కపుల్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, కపుల్స్ క్లబ్ అధ్యక్షురాలు వాసా నాగమణి, కార్యదర్శి దారా సూర్యకళ, జిల్లా ఆర్యవైశ్య సంఘం బిల్డింగ్ కమిటీ చైర్మన్ పేరూరి లక్ష్మీనరసింహారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్ కొత్తమాజు రామారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం, వాటర్ బాటిళ్ల అందజేత



కంచికచర్ల: మండలంలోని పెండ్యాల గ్రామానికి చెందిన జేఎం ఫౌండేషన్ కమిటీ సభ్యులతో పాటు ఏపీఎస్ఏ ఆధ్వర్యంలో వరద బాధితులకు సోమవారం భోజనం, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వరదలు రావటంతో విజయవాడ సింగ్‌నగర్‌లో నివసించే ప్రజలు నిరాశ్రయులయ్యారని జేఎం ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. నాలుగు దశాబ్దాల నుంచి పేద కుటుంబాలకు తమ సంస్థ ద్వారా అన్ని విధాలుగా ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు ఇచ్చి ఆదుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జేఎం సభ్యులతో పాటు షేక్ గౌస్‌పాషా, షాహిమ్, మన్నాన్, సయ్యద్ అహ్మద్, నీముద్దీన్, ముక్బుల్ నవాబ్, అల్సో యూసిఫ్, జబ్బర్ పాల్గొన్నారు.

పంచాయతీలకు రూ. 21 లక్షల మంజూరు

జగ్గయ్యపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పొంగి పొర్లిన వాగులు, వంకల నేపథ్యంలో పలు గ్రామాల్లో అపార నష్టం వాటిల్లింది. దీంతో ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు సాయంగా ఒక్కో పంచాయతీకి రూ. లక్ష చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 21 గ్రామ పంచాయతీలకు రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి. మండలంలో బలుసుపాడు, బండిపాలెం, బూదవాడ, చిల్లకల్లు, ధర్మవరప్పాడుతండ, గండ్రాయి, మల్కాపురం, రావిరాల, రెడ్డినాయక్‌తండ, తక్కెళ్లపాడు, వత్సవాయి మండలంలో భీమవరం, డబ్బాకుపల్లి, లింగాల, సింగవరం, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలంలో అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, ముచ్చింతాల, నవాబుపేట, పెనుగంచిప్రోలు, శనగపాడు గ్రామాలకు రూ. లక్ష చొప్పున మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన చెక్కులను పట్టణంలోని కొత్త వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో సోమవారం ఎమ్మెల్యే రాజగోపాల్ ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్పంచ్‌లకు అందజేశారు.

చెరువుల గండ్లను వెంటనే పూడ్చాలి

మైలవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వలన మైలవరంలో చెరువులకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి మండలంలోని చంద్రాల గ్రామంలో మంతెన చెరువు (ఊర చెరువు)ను, పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అడ్డగోలుగా చెరువు కట్టలకు ర్యాంపులు వేసి మట్టిని అక్రమంగా తరలించడం వల్లే చెరువుల కట్టలు తెగాయని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. ఈ కారణంగానే బుడమేరు పొంగిందన్నారు. అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో బుడమేరు ద్వారా విజయవాడ మరొకసారి వరద ముంపునకు గురి కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. డైవర్షన్ కెనాల్‌కు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ-క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. బుడమేరు ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అధికార, ప్రతిపక్షాలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నష్టపరిహారాన్ని సంపాదించుకోవాలని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట వెళ్లే రహదారి కొట్టుకుపోయి కనిపిస్తున్న రాళ్లు



కెలగ్రహారంలో పూర్తిగా కొట్టుకుపోయిన దొండ సాగు



పాలేటి ధాటికి కొట్టుకుపోయిన అన్నవరం-బలుసుపాడు వంతెన

సర్వం వరద పాలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పాలేరు ఉగ్ర రూపం దాల్చింది. నది పరివాహక గ్రామాలైన తక్కెళ్లపాడు, బలుసుపాడు, అన్నవరం, రెడ్డినాయక్ తండా, బూదవాడ, అగ్రహారంలో వరద ఉధృతికి పంట పొలాలు, గృహాలు కొట్టుకుపోయాయి. ఆయా గ్రామాలను కలిపే రోడ్లు, వంతెనలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఎన్నడూ లేని విధంగా సర్వం వరదల పాలయ్యాయి. వరద ఉధృతి విషాదాన్ని మిగిల్చిందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కొట్టుకుపోయిన పంట పొలాలు, గృహాలు



బూదవాడలో పూర్తిగా ధ్వంసమైన ఇల్లు



బూదవాడలో వరద ఉధృతికి పునాది పిల్లర్లు కనిపిస్తున్న సచివాలయ భవనం

జగ్గయ్యపేట: ఉధృతంగా వచ్చిన వరదకు తక్కెళ్లపాడులో తాగునీటి పైప్‌లైన్ ప్రాజెక్టుతో పాటు పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బలుసుపాడులో పలు కాలనీల్లోకి వరద నీరుచేరడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అన్నవరంలో పాలేటిపై ఉన్న వంతెన కొట్టుకుపోయింది. దీంతో పాటు పంట పొలాలు వరి, పత్తి, మిర్చి తుడిచి పెట్టుకుపోయాయి. రెడ్డినాయక్‌తండా, బూదవాడ గ్రామాలను వరద చుట్టుముట్టింది. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సైతం పదుల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొన్ని ఇళ్లతోపాటు, రెండు గ్రామాలకు చెందిన అప్రోచ్ రోడ్డు అడ్రస్ లేకుండా పోయింది. గ్రామం నుంచి జగ్గయ్యపేట వెళ్లే రహదారి కిలోమీటర్ల మేర కొట్టుకుపోయి రాళ్లు దర్శనమిస్తున్నాయి. నది ఒడ్డున నిర్మించిన గ్రామ సచివాలయ భవనం కూడా కొద్దిమేర మునిగింది. ప్రస్తుతం పిల్లర్లపై నిలిచి ఉంది. విద్యుత్ మోటార్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి.



పాలేటిలో కొట్టుకుపోయిన విద్యుత్ స్తంభాలు

నష్టపరిహారం చెల్లించాలి



పాలేటికి వచ్చిన వరద ఉధృతిని గతంలో ఎప్పుడూ చూడలేదు. రాత్రికి రాత్రే పాలేరు ఉధృతంగా ప్రవహించటంతో పంట పొలాలు, ఇళ్లు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా గ్రామానికి వెళ్లే వంతెన కొట్టుకుపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వం స్పందించి సర్వే చేపట్టి, వెంటనే పంట నష్టపరిహారం చెల్లించాలి.

– ఆవుల శ్రీనివాసరావు, సర్పంచ్, కెలగ్రహారం

ఆరు ఎకరాలు నీటిపాలు



గ్రామంలోని పాలేటి పక్కన ఆరెకరాల్లో వరి పంట సాగు చేశాం. పాలేటికి వరద రావటంతో పంట మొత్తం పూర్తిగా కొట్టుకుపోయింది. దాదాపు రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం ఏమి చేయాలో అర్థం కావటం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– పద్మాల నరసింహారావు, అన్నవరం


నష్టంపై నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి



కొత్తపేటలో పశుగ్రాసం కొరత ఉందని ఎమ్మెల్యేకు తెలియజేస్తున్న రైతులు

కంచికచర్ల: వరద తాకిడికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందజేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను సోమవారం పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్పపీడన ద్రోణి ప్రభావంతో కుండపోతగా వర్షాలు కురిశాయన్నారు. అంతేకాకుండా భారీగా వరదలు రావటంతో రైతులు సాగుచేసిన పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అధికారులు వరదల వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదిక తయారు చేయాలని ప్రభుత్వానికి అందజేయాలని అన్నారు. పశుగ్రాసం వరదల్లో కొట్టుకుపోయాయని అందువల్ల పశుగ్రాసం అందేలా చూడాలని కొత్తపేట గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గని ఆత్కూరు గ్రామంలో వీఆర్వో అందుబాటులో ఉండటంలేదని, లంకభూముల్లో నివసిస్తున్న రైతుల ఇళ్లు పూర్తిగా వరదనీటిలో తేలియాడుతున్నాయని అలసత్వం ప్రదర్శిస్తుందని వీఆర్వోను తొలగించాలని రైతులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ జాహ్నవి, ఎంపీడీఓ కే శిల్ప, మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, డీటీ షేక్ నాగుల్‌మీరా, నాయకులు కోగంటి బాబు, ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు వెంపరాలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



భీమవరం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం



పేటలోని చింతావారి కాంప్లెక్స్ వద్ద గణనాథునికి పూజలు చేస్తున్న యూత్ సభ్యులు



పేటలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన గణనాథుడు

వత్సవాయి: వినాయక నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. సోమవారం మూడో రోజు పూజలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మూడు రోజులు పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఐదు, తొమ్మిది రోజులు అనంతరం నిమజ్జనానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా నిమజ్జనాల సందర్భంగా నిర్వాహకులు జాగ్రత్త వహించాలని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలకు సోమవారం మూడో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయంతో పాటు నవాబుపేటలో, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రులోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరి వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనిగండ్లపాడు, శివాపురంలో మూడవ రోజు గణనాథుని నిమజ్జనాలు వైభవంగా నిర్వహించారు. తోటచర్లలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని పందిర వద్ద గణేష్ చేతిలో లడ్డూను రూ.7 వేలకు పోతురాజు కృష్ణమూర్తి అనే భక్తుడు వేలం పాటలో కైవసం చేసుకున్నాడు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో సోమవారం మూడో రోజున పలు వార్డులలోని మండపాల్లో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణబజారులోని ఆనందసాయి ఆంజనేయస్వామి ఆలయం వద్ద 18 అడుగుల ఎత్తు విగ్రహం ఏర్పాటుచేసిన మండపంలో, కోదాడరోడ్‌లోని చింతా వారి కాంప్లెక్స్ వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు.

వీరులపాడులో..

వీరులపాడు: వినాయక చవితి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకునికి సోమవారం పలువురు దంపతులు పీటలపై కూర్చుని విశేష పూజలు చేశారు. అనంతరం విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో గ్రామ సమీపంలోని మున్నేటిలో నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, గ్రామ నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మున్నేటి బ్రిడ్జిపై నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణబాబు

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

నందిగామ టౌన్: వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి సమీపంలోని మున్నేటి బ్రిడ్జిపై వినాయక నిమజ్జన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సూచనల మేరకు నిమజ్జనానికి అనుమతిస్తామన్నారు. ముఖ్యంగా మున్నేటికి వరద ఉధృతి అధికంగా ఉన్నందున వినాయక నిమజ్జనాల నిమిత్తం లోతులోకి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఫణిశ్రీనివాసరావు, ఎస్ఐ శాతకర్ణి పాల్గొన్నారు.

నిమజ్జనానికి కృష్ణానది వద్ద ఏర్పాట్లు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానది వద్ద యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం ఫంటు ఏర్పాటు చేసినట్లు ఈఓ హేమలతాదేవి తెలిపారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఈ ప్రాంతం నుంచే కాకుండా తెలంగాణా ప్రాంతం నుంచి కూడా గణపతి విగ్రహాలు నిమజ్జనం చేస్తారని పేర్కొన్నారు. దీంతో నదిలో ఫంటు ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల సూచనల మేరకు గజ ఈతగాళ్లతో పాటు ఆలయ సిబ్బంది కూడా నది వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. నదికి వరద వస్తుండటంతో పోలీసుల సూచనల మేరకు మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు.

కంచికచర్లలో..



కంచికచర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో గణనాథుడికి భక్తుల పూజలు

కంచికచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ విగ్రహాలను సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కంచికచర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్యవైశ్య సంఘ వర్తకులు ఏర్పాటు చేసిన గణనాథుడుకి విశేష పూజలు చేశారు. కంచికచర్లలోని నెహ్రూబొమ్మ సెంటర్, పెట్రోలు బంక్‌సెంటర్, పశువుల ఆస్పత్రి రోడ్డు, తీగెల బజార్, రామాలయం పెద్ద బజార్, హనుమాన్‌పేట, పోలీస్‌స్టేషన్ సెంటర్, వసంతకాలనీ, మోడల్‌కాలనీ, ప్రణీత కాలనీ, తదితర ప్రాంతాల్లో గణేషుడికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గండేపల్లిలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనం చేశారు.



అనిగండ్లపాడులో నిమజ్జనానికి ఊరేగింపుగా వెళుతున్న విఘ్ననాథుడు



జగన్నాథపురంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



నిమజ్జనానికి నదిలో ఏర్పాటు చేసిన ఫంటు

నష్ట పరిహారం వెంటనే అందించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతి, నాయకులు

వైఎస్సార్ సీపీ నాయకులు

కంచికచర్ల: అల్పపీడనం ప్రభావంతో ఇటీవల కుండపోత వర్షాలకు రైతులు సాగుచేసిన పంటలన్నీ నీట మునిగాయని, తక్షణమే ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందజేయాలని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా వరదలతో రైతులు సాగుచేసిన పంటలన్నీ నీటి మునిగి కుళ్లిపోయాయన్నారు.

పంటలు దెబ్బతినటంతోపాటు పశుగ్రాసం లేక పశువులు అల్లాడిపోయాయని తెలిపారు. అంతేకాకుండా కృష్ణానది, మున్నేరుకు వరదనీరు బాగా చేరిందన్నారు. ఏటిపట్టు గ్రామాలన్నీ నీటి మునిగాయని తెలిపారు. తిండి లేక, ఉండేందుకు వసతి లేక పలు గ్రామాల ప్రజలు అల్లాడిపోయారన్నారు.

గత ప్రభుత్వం మాదిరిగానే రైతులను ఆదుకోవాలి

ప్రకృతి విపత్తు వల్ల జరిగిన పంటల నష్టానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.19వేల నుంచి రూ.లక్ష వరకు నష్ట పరిహారం అందజేసిందని నాయకులు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. ఈ-క్రాప్ చేయించని రైతులను గుర్తించి, వరదలకు పంటలు దెబ్బతిన్న వారికి కూడా పరిహారం అందజేయాలన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా దెబ్బతిన్న పంటలను పొలాల్లోకి వెళ్లి సర్వే చేసి, నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు, నాయకులు చింతా రవీంద్రనాథ్, గుదే అక్కారావు, గుదే సాంబశివరావు, వేల్పుల రమేష్, బుడ్డి సత్యనారాయణ, రాయల నరసింహారావు, మంగిశెట్టి పుల్లారావు, అశోక్, వేమవరపు పురుషోత్తం, వెలగలేటి బాబు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల సంభవించిన వరద ముంపునకు గురై పూర్తిగా ధ్వంసమైన బీసీల శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సామాజికవేత్త మెటికల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన బీసీల శ్మశానవాటిక బాధితులు పొట్టాబత్తిన పాండురంగారావు, పి.శ్రీనివాసరావు తదితరులతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలేటి ఒడ్డున ముక్త్యాల రోడ్‌లో ఉన్న ఈ శ్మశానవాటికలో బీసీలైన పద్మశాలీలు, వడ్డెర, ముదిరాజ్, రజక కులాలకు చెందిన వారికి చెందిన కర్మకాండలు జరుపుకుంటారని తెలిపారు. ఈ శ్మశానవాటిక చుట్టూ ఉన్న ప్రహరీగోడ, కర్మకాండలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా ఉన్న గదులు కొట్టుకుపోయాయని పేర్కొన్నారు. అలాగే వరద నీటికి శ్మశానవాటికి మట్టి, రోడ్డు అంతా కొట్టుకుపోయి పెద్ద గొయ్యి ఏర్పడిందని తెలిపారు. ప్రహరీగోడ, గదులు కొట్టుకుపోవడంతో సుమారు రూ.2 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన శ్మశానవాటికను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.



డీటీ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మెటికల శ్రీనివాసరావు, తదితరులు

● ఫుడ్ ప్యాకెట్ల పంపిణీ

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామం పునరావాస కేంద్రంలో వరద బాధితులు 200 మందికి సోమవారం సాయంత్రం ఫుడ్‌ప్యాకెట్లు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జీ, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, కమర్షియల్ కోర్ట్ జడ్జి పి.శ్రీధర్, గవర్నమెంట్ ప్లీడర్ చిన్నం రామకృష్ణ, న్యాయవాది ఎస్.పూర్ణచంద్రరావు, వీఆర్వో ఆర్.చంద్రశేఖర్‌శర్మ పాల్గొన్నారు.